# భస్మ బుధవారము (లెంటు-Lent)

**తేది :** 05 - 03 - 2014

"మీ వస్త్రములను కాక మీ హృదయములను చింపుకొని ఆయన తట్టు తిరుగుడి" - యోవేలు 2 : 12,13

రెవ. యేసురత్నం దేవరపల్లి
హైదరాబాద్.

క్రైస్తవ లోకానికి అత్యంత విలువైన కాలము లెంటు, లెంటులోని ప్రారంభదినము భస్మ బుధవారము (Ash-Wednesday) లెంటు ఈస్టరుకు ముందు - (ఆదివారములు మినహాయించి) వచ్చు నలుబది దిములు. ఈ మండల కాలపుదినములలో క్రైస్తవులు ఉపవాసముందు దినములు. ప్రభువు లోక రక్షణార్థమై పరార్థశ్రమ (Vicarious Suffering) నొందిన ఈ దినములలో ప్రభుని సిలువ శ్రమలను ధ్యానించుట ఉపవాసముండి ధ్యానించుట-యుక్తమని ఆదిమ సంఘము భావించింది.

భస్మబుదవారమును 6వ శతాబ్దంలో రోమా పట్టణపు పోపు మహాగ్రెగరి సంఘములో ప్రవేశపెట్టెను. ఇది ఆధ్యాత్మిక జీవితానికి క్రొత్త మలుపు. మండల కాలమునకు మొదటి మెట్టు. ఈ దినం నుండి 40 దినముల భక్తి శ్రద్ధలతో, ఉపవాసముతో, నియమ నిష్ఠలతో పరిశుద్ధ గ్రంథంలోని ఆయా లేఖన భాగములను గ్రహించుటకును, శరీర ఆత్మలను నలగగొట్టు కొనుటకుగాను, కొన్ని గంటలు ధ్యానించి, ప్రార్థించి యేసుతో కూడా కలసి జీవించుటకు మనకు దేవుడు మరొక తరుణమును ప్రసాదించియున్నాడు. లెంటు (Lent) అను పదము EBM›[-× "[ పదమైన "Leneten" నుండి ఉత్పన్నమగుచున్నది. Leneten అనగా "చీల్చు", "పగులగొట్టు", "చిగుర్చుటకు ప్రారంభము", "వసంత కాలము" (Spring) అను వివిదార్థములున్నవి. "ఉపవాసమునుండి కన్నీరు విడుచుచు, దు:ఖించుచు మన:పూర్వకముగా తిరిగిఆయనవైపు తిరుగుకాలమే" లెంటు, యోవేలు 2:12, 13. "ఇప్పుడైనను మీరు ఉపవాసముండి కన్నీరు విడుచుచు ధు:ఖించుచు మన:పూర్వకంగా తిరిగి నా యొద్దకు రండి మన వస్త్రములను కాక మన హృదయములను చింపుకొని దేవుని వైపు తిరుగుకాలమే" లెంటు.

**ఉపవాస ఋతువు ఉద్దేశ్యము 3 విధములు :** 1). శరీరమును ఉపవాసముచే కృంగదీసి లోబరుచుకొనుట, 2) విశేష ప్రార్థనలచేత - వాక్యముచేత ఆత్మను బలపరుచుట. 3) మన పశ్చాత్తాపము నిజమైనదే అని ఋజువు చేసుకొనుట.

పాత నిబంధనలో ప్రవక్తలు రాజులు- నాయకులు - ప్రజలు ఈ ఉపవాసము నందు గోనెపట్టా ధరించి - బూడిదలో కూర్చున్నారు. భస్మము-బూడెద :- దీని భావము 1) ఒక పదార్థము కాలిన తరువాత దానిలో మిగిలిన నిర్జీవ పదార్థము. 2) యజ్ఞములు లేక బలులు జరిపిన తరువాత, అవి కాల్చబడగావాటి యందు మిగిలిన నిరూపయోగ పదార్థము. బూడిద- భస్మము అనగా కాలిపోయినది, ఎన్నిక లేనిది, శక్తిలేనిది.

3) కేథలిక్కులు (R.C.M) గత సంవత్సరము, మట్టలాది వారపు ఆరాధనలో మట్టలను ఆశీర్వదించి, వాటిని దహించుదురు. దహించబడిన దానిబూడిదెను ప్రతి విశ్వాసి వారి నుదుటను వ్రాయుచూ నీవు మన్నువు గనుక తిరిగి మన్నై పోవుదువని చెప్పుదురు.

1) ఇది పశ్చాత్తాపమునకు, గుర్తుగా బైబిలు గ్రంథములో చెప్పబడినది. యోబు 42:6). దుఃఖమునకు, గుర్తుగా బూడెదను తమపై జల్లుకొనిరి. యిర్మియా 6:26, 3). పాప క్షమాపణ కొరకు – విజ్ఞాపనమునకు గుర్తుగా వాడిరి. యోనా 3:59 నినెవే పట్టణస్తులు తమ పాపము గూర్చి పశ్చాతాపముతో క్షమాపన కొరకై దేవుని సన్నిధిలో విజ్ఞాపనము చేసిరి. ఆ సమయమున, తమదీనత్వము గుర్తు చేయుచూ వారు బూడిదలో కూర్చిండిరి. ఇది ప్రారంభము నుండి 40 దినములు ఆచరించబడుచుండెను. "40 దినములు అనునది బైబిలు గ్రంథములో చాలా ప్రాముఖ్యమైన సంఖ్యగా చూడగలము.

1) మోషే సీనాయి పర్వతము మీద 40 దిములు నిర్గ.కా. 24:18 2) ఏలియా 40 దినముల ప్రయాణము. 1 రాజులు 19:8. 3) నినివే ప్రజలు ఉపవాసము 40 దిములు. యోనా 3:4, 4) న్యాయ సభయందు దోషిని శిక్షించుటకు 40 దెబ్బలు. ద్వితియోప 25:3. 5) క్రీస్తు పరిచర్యకు ముందు 40 దినాలు ఉపవాసము. బాప్తీస్మము తరువాత మత్తయి 4:2, లూకా 4:1, మార్కు 1:13.

పాత నిబంధన కాలములో జరిగిన ఒక సన్నివేశాన్ని గుర్తుచేసుకుందాం. అబ్రహాము ఇదిగో ధూళియు బూడిదెయునైన నేను ప్రభువుతో మాటలాడ తెగించుచున్నాను. (ఆది 18:27). విశ్వాసులకు తండ్రి బిరుదు పొందిన అబ్రహాము ఎలాగు దేవునికి తన విధేయత కనపర్చుచున్నాడో ఇందు వ్యక్తమగుచున్నది. ధూళితో, బూడిదతో సమానంగా ఎంచుకుంటున్నాడు. అలాగే మనం ప్రభువు సాన్నిధ్యములో తగ్గింపు కలిగి యీ నలువది దినములు గడుపుట మన ఆత్మీయ జీవితములో దేవునితో మాట్లాడగలిగే ధైర్యము పొందగలమని యిందు రుజువగుచున్నది.

నలువది దినములకు నీనెవె పట్టణము నాశనమగునని యోనా ప్రవక్త చేసిన ప్రకటన విని రాజు సింహాసనము నుండి దిగి, తన రాజవస్త్రములను తీసివేసి గోనెబట్ట కట్టుకొని బూడిదెలో కూర్చుండెను. (యోనా 3:6) ఉపవాస దినము ప్రకటించెను, ఇలా వారి ప్రవర్తనలోగల మార్పునుబట్టి దేవునిచేత కనికరింపబడి రానైయున్న నాశనము నుండి తప్పించబడ్డారు.

మొర్దెకై తన బట్టలు చింపుకొని, గోనెబట్టలు వేసుకొని బూడిద పోసుకొని పట్టణము మధ్యకు బయలువెల్లి మహా శోకముతో రోదన చేసెను. (ఎస్తేరు 4:1)

మోషే ఆ మేఘములో ప్రవేశించి కొండమీదికి ఎక్కెను. మోషే ఆ కొండమీద రేయింబవళ్ళు నలభై దినములు ఉండెను. (నిర్గమా కాండము 24:18)

క్రొత్త నిబంధనలో ఉపవాస ప్రార్థన గురించి మత్తయి 6:16. "మీరు ఉపవాసము చేయుచున్నట్లు మనుషులకు కనబడవలెనని కాక, రహస్యమందున్న నీ తండ్రికే కనపడవలెనని నీవు ఉపవాసము చేయునప్పుడు నీ తల అంటుకొని, నీ మొఖము కడుగుకొనుము.

ఆపొస్తులుడైన పౌలు "దైవచిత్తానుసారమైన.... దుఃఖము రక్షణార్థమైన మారు మనుస్సును కలుగచేయును. ఈ మారుమనస్సు దు:ఖమును పుట్టించదు. 2 కొరింథి 7:10. ధు:ఖ పడుట ఎవరికి ఇష్టం వుండదు. అందరు సంతోషం కోరుకుంటారు. సంతోషం పొంది, అనుభవించి చివరకు శిక్ష పొందుటకంటే మన అక్రమముల కొరకు దుఃఖించి, విలపించి దేవుని దగ్గర శాంతి, సమాధానం, నిత్యరక్షణ పొందుట మేలు.





మానవ జీవితమునకంతము మరణం. భూస్థాపన కార్యక్రమం ఆఖరిలో చెప్పబడే మాటలు యివి. "శరీరమును మంటికి మన్నుగాను, బూడిదకు బూడిదగాను, దుమ్ముకు దుమ్ముగాను భూమికి అప్పగించుచున్నాము" ఈ మాటలనుబట్టి మానవుడు బూడిదగా అయ్యే భౌతిక శరీరాన్ని నమ్ముకొనక, శాశ్వతంగా దేవుని దగ్గర చేరే అత్మను గూర్చి ఆలోచన కల్గి యుండాలనే తాత్పర్యం యిందు పొందపర్చబడింది.

క్రైస్తవ విశ్వాసములో ఉపవాసము ద్వారా క్రీస్తుతో మనము ఆత్మయందు – సాలోక్య సామీప్య–సారూప్య–సాయుధ్యతలను, పొందవలెను. సాలోక్య–అనగా దైవ దీవెనకు, అర్హతపొందుట. సామీప్య–అనగా దేవునికి సమీపముగా ఉండుట. సారూప్య– దేవుని వలే మార్చబడుట. సాయుధ్యత అనగా–దైవత్వమును పొందుట. శ్రమలకాలపు ధాన్యముల ద్వారా, ఉపవాస ప్రార్ధనల ద్వారా, మొదట దైవదీవెనలకు అర్హతను పొంది, తరువాత ఆయనకు, సమీపస్తులుగా ఉండుటద్వారా రూపాంతరం పొంది దేవుని సారూప్యంలో మార్చబడుటకు క్రైస్తవ సంఘానికి ఒక వరం లాంటిది ఈ లెంటు కాలం.

భస్మ బుధవారం ఆరాధనలో పాల్గొనే మనం ముందుగా తామేమైయున్నామో అనేది గ్రహించవలెను. ఇట్టి క్షణికమైన నశించిపోయె జీవితానికన్నా మరోసారి యీ శ్రమలకాలమందు క్రీస్తు సిలువపై మనస్సు కేంద్రీకరించాలనేది వ్యక్తమగుచున్నది. లోకములో అనేకవాటికై తాపత్రయంతో పాటు ఒక్కొక్కప్పుడు విచారం, దు:ఖం వెళ్ళబుచ్చుట సహజం. దానికన్నా నిన్ను నన్ను లోకమందున్న సర్వమానవాళిని సిలువ యాగములో రక్షింప సమాయత్తమైన క్రీస్తునందు మన విశ్వాసాన్ని గట్టిపర్చుకొనుటకు ఇదొక సదవకాశం.

సుంకరి –దేవా ! పాపినైన నన్ను కరుణించుము అని ప్రార్థించెను లూకా 18:13.

యోహాను తన శిష్యులకు యేసును ఇలా పరిచయంచేసాడు "ఇదిగో లోకపాపములను మోసుకొనిపోవు దేవుని గొర్రెపిల్ల" (యోహాను 1:36) కావున మరోసారి మనలను మనం పరీక్షించుకొని దేవుని కాయాసము కలిగించే మార్గములు మనయందు కలవేమో గ్రహించి యీ 40 దినాల్లో సరియేసుకొందాం. కావున ఈ మండల కాలంలో సిలువ దరికి ఆకర్షింపబడి సిలువలో మన కలుషములను పారుజూచుకొని పశ్చాత్తాపడి, ఉపవాసంతో మారు మనస్సు పొంది, తిరిగి ఆయన దగ్గరకు చేరి సంతోషం, సమాధానం పొందుడి.

పఠించుము : ప్రార్థనా పూర్వకముగా దేవుడు నీతో ఏమి మాట్లాడుచున్నాడో గమనించుము.

ధ్యానించుము : చదివిన భాగములోని ముఖ్యాంశములను గమనించుము.

ప్రార్థించుము : నీవు చదివిన ధ్యానాంశమును ఆధారము చేసుకుని దేవుని స్తుతించి పాపమును ఒప్పుకుని నీ కొరకు ఇతరుల కొరకు ప్రార్థించుము.

**పరిశుద్ధాత్మ దేవుడు మనలను బలపర్చునుగాక. ఆమెన్ !!**